తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాదాద్రి భువనగిరి
శనివారం
24 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

## యువత ఆడుకోవాల్సిన మైదానంలో
# పశువుల స్వైరవిహారం!



- ○అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం
- ○గుంతలమయంగా మారిన మైదానం.. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అధ్వాన స్థితి
- ○సొంత అవసరాలకు మైదానాన్ని వాడుకుంటున్నారంటూ గ్రామ యువత ఆరోపణలు
- ○తక్షణమే మరమ్మతులు చేపట్టి క్రీడలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్

**అశ్వాపురం అక్టోబర్ 23 (జనంసాక్షి):** గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడాల్సిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో నిరుపయోగంగా మారుతోందని అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైదానాన్ని సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యతను సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం విస్మరించడంతో ప్రస్తుతం ఆ ప్రాంగణం క్రీడలకు పనికిరాకుండా పోతోందని ఆరోపిస్తున్నారు. పిల్లలు, యువత క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలు ఆడుకోవాల్సిన మైదానంలో ఆవులు, గేదెలు, కుక్కలు, పందులు సంచరిస్తుండగా, మరోవైపు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి మైదానం రూపురేఖలే మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దాల్సిన ప్రాంగణం అడవిని తలపించేలా మారడం గ్రామస్థాయిలో క్రీడల అభివృద్ధిపై పాలకవర్గానికి, అధికారులకు ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని విమర్శిస్తున్నారు.



**ఒకప్పుడు టోర్నీలు.. నేడు నిర్లక్ష్యానికి చిరునామా!**

గతంలో మైదానం చక్కగా ఉండేదని, పండుగ సెలవులు, ఆదివారాల్లో గ్రామ యువత అంతా కలిసి క్రికెట్ వంటి క్రీడలు ఆడుకుంటూ చిన్నచిన్న టోర్నమెంట్లు నిర్వహించుకునేవారని యువత గుర్తుచేస్తున్నారు. అయితే ప్రస్తుతం మైదానం అధ్వానంగా మారడంతో ఆటలు ఆడుకునేందుకు అనుకూల పరిస్థితులు లేకుండా పోయాయని చెబుతున్నారు. సెలవు రోజుల్లో క్రీడలతో సమయం గడుపుతూ శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాల్సిన యువతకు అందుబాటులో ఉండాల్సిన మైదానం ఇలా నిరుపయోగంగా మారడం బాధాకరమని పేర్కొంటున్నారు.

**మైదానం క్రీడల కోసమా.. ఇతర అవసరాల కోసమా?**

తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని నెల్లిపాక సొసైటీ ధాన్యం ఆరబెట్టేందుకు వినియోగిస్తోందని గ్రామ యువత ఆరోపిస్తున్నారు. ధాన్యం ఆరబెట్టే ప్రక్రియలో మైదానం దెబ్బతిని గుంతలు ఏర్పడుతున్నాయని, పనులు పూర్తయిన తర్వాత వాటిని పూడ్చి మైదానాన్ని తిరిగి యథాస్థితికి తీసుకురావడంలో నిర్లక్ష్యం జరుగుతోందని విమర్శిస్తున్నారు. ఈ గుంతలు క్రీడాకారులకు ప్రమాదకరంగా మారడంతో మైదానంలో ఆడుకునేందుకు వీలు లేకుండా పోతుందని గ్రామ

వార్తా లోపలి పేజీలో

# సఫాయి బస్తి ఏరియాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## ○49 వాహనాలపై జరిమానాలు, 87 మద్యం సీసాలు స్వాధీనం



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్23 (జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తి ఏరియాలో శుక్రవారం తెల్లవారుజామున 4:00 గంటల నుంచి ఉదయం 7:00 గంటల వరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 2 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 49 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ ఆదినారాయణ స్థానికులతో మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి సేవించే వ్యక్తుల గురించి లేదా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి డీ–అడిక్షన్ కేంద్రాలకు తరలించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు అనే విషయాలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, ప్రాంతంలో మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌తో పాటు పోలీసు అధికారులు, సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు
# బీఆర్ఎస్‌కు గట్టి షాక్



**మోటకొండూరు, అక్టోబర్ 23 (జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలో బీఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. కొండాపురం గ్రామానికి చెందిన పలువురు కీలక నేతలు గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలన్న సమక్షంలో మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వీరంతా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

కొల యాదగిరి( గత 15 సంవత్సరాలుగా బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు), సురపంగా కిష్టయ్య (గ్రామ శాఖ ఉపాధ్యక్షులు) పంజాల వనిత (3వ వార్డు బీఆర్ఎస్ వార్డు మెంబర్),గుండేటి సుభాష్ (8వ వార్డు బీఆర్ఎస్ వార్డు మెంబర్) వీరితో పాటు కొండాపూర్ గ్రామానికి చెందిన సుమారు 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలన్న నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసే తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నూతనంగా పార్టీలోకి వచ్చిన నాయకులు వెల్లడించారు. గత పది సంవత్సరాలలో లేని విధంగా ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీ మారినట్లు వారు తెలిపారు.

# యువత ఆడుకోవాల్సిన మైదానంలో పశువుల స్వైరవిహారం!

యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల పేరుతో మైదానంలో ఇసుక, కంకర వంటి నిర్మాణ సామగ్రిని నిల్వ ఉంచుతున్నారని, కొందరు సొంత అవసరాలకు అనుగుణంగా ప్రాంగణాన్ని వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అటువంటి వారిపై అధికారులు పాలకవర్గం వెంటనే చర్యలు తీసుకుని నోటీసులు ఇవ్వాలని ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని గ్రామ యువత కోరుతున్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ప్రజా క్రీడా ప్రాంగణాన్ని వ్యక్తిగత లేదా ఇతర అవసరాలకు ఇష్టానుసారంగా వినియోగిస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనీ యువత నిలదీస్తున్నారు.

**పాలకవర్గం, అధికారుల పర్యవేక్షణ ఏది?**

మైదానం నిర్వహణపై గ్రామపంచాయతీ పాలకవర్గం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని గ్రామ యువత విమర్శిస్తున్నారు. మైదానంలో చెత్తాచెదారం పేరుకుపోతున్నా, పిచ్చిమొక్కలు పెరుగుతున్నా, గుంతలు ఏర్పడుతున్నా పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యమని ఆరోపిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రాంగణాన్ని కాపాడలేకపోతే గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యం ఎలా నెరవేరుతుందని ప్రశ్నిస్తున్నారు. కేవలం క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడంతోనే ప్రభుత్వ బాధ్యత పూర్తికాదని, దానిని నిరంతరం నిర్వహిస్తూ యువతకు ఉపయోగపడేలా చూడాలని సూచిస్తున్నారు. మైదానం నిర్వహణపై ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

**తక్షణమే శుభ్రపరిచి.. క్రికెట్ పిచ్ ఏర్పాటు చేయాలి:**

మైదానంలోని చెత్తాచెదారాన్ని తొలగించి, పిచ్చిమొక్కలను శుభ్రం చేసి, గుంతలను పూడ్చి క్రీడలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని గ్రామ యువత కోరుతున్నారు. ముఖ్యంగా క్రికెట్ ఆడేందుకు అనువైన పిచ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర క్రీడలు నిర్వహించుకునేలా మైదానాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మైదానం చుట్టూ అవసరమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పశువులు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. క్రీడా ప్రాంగణాన్ని ప్రైవేటు కార్యక్రమాలకు, ఇతర అవసరాలకు ఇష్టానుసారంగా వినియోగించకుండా స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని కోరుతున్నారు. మైదానానికి అడ్డంకులు సృష్టిస్తూ, దానిని దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**స్పందించకపోతే కలెక్టర్ దృష్టికి సమస్య:**

మల్లెలమడుగు గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని వెంటనే శుభ్రపరిచి పునరుద్ధరించి యువతకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ యువత పంచాయతీ పాలకవర్గం, సంబంధిత అధికారులను హెచ్చరిస్తున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి మైదానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి గ్రామ యువతకు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రామ యువతకు క్రీడా మైదానం ఉపయోగపడాలని ఆనాడు విశాలమైన మైదానాన్ని ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని అదేవిధంగా మల్లెమడుగు లో గల క్రీడా మైదానానికి నియోజకవర్గంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని గుర్తింపును గౌరవాన్ని కొనసాగిస్తూ మైదానాన్ని యధావిధిగా గ్రామ యువతకు అందుబాటులోకి వచ్చే విధంగా పంచాయతీ పాలకవర్గం అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, మైదానానికి రెండు తరాల చరిత్ర ఉందని భవిష్యత్ తరాలకు ఈ క్రీడ మైదానాన్ని అందించేందుకు తీర్చిదిద్దాలని ఇకనైనా నిర్లక్ష్యం వీడి వెంటనే మైదానం శుభ్రపరచేందుకు చర్యలు చేపట్టాలని గ్రామంలో ఉన్న సీనియర్ క్రీడాకారులు , క్రీడాభిమానులు, గ్రామ ప్రజలు, యువకులు కోరుతున్నారు.

## 73 ఏళ్ల వయసులో ప్రపంచ వేదికపై సత్తా..
## శంకరరావుకు రజత పతకం..

❍ గుండె బైపాస్ శస్త్రచికిత్సను అధిగమించి అసాధారణ ప్రతిభ..

❍ ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు..




భద్రాచలం అక్టోబర్ 23 (జనంసాక్షి) ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో భద్రాచలానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు డి.వి. వెంకట శంకరరావు మరోసారి సత్తా చాటి రజత పతకాన్ని సాధించారు. అమెరికాలోని నెవాడా రాష్ట్రం రెనో నగరంలో జరుగుతున్న ప్రపంచ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 74 కిలోల విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. రెనోలోని సిల్వర్ లెగసీ బాల్‌రూమ్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ మాస్టర్స్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో శంకరరావు ఈ ఘనత సాధించారు. అంతకుముందు ఈ నెల 15న జరిగిన ప్రపంచ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. దీంతో ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు విభాగాల్లో రెండు పతకాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు.

**- గుండె శస్త్రచికిత్సను అధిగమించి..**

2012లో గుండెకు బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్న శంకరరావు ఆరోగ్యపరమైన సవాళ్లను అధిగమించి క్రీడలపై తనకున్న ఆసక్తిని కొనసాగిస్తున్నారు. 73 ఏళ్ల వయసులోనూ క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడి పతకాలు సాధించడం విశేషం. ఆయన విజయాలు యువ క్రీడాకారులతో పాటు అన్ని వయసుల వారికి స్ఫూర్తినిస్తున్నాయి. ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రెండు పతకాలు సాధించిన శంకరరావును రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. మల్లేష్, పాకాల దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రామిరెడ్డి, కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజీ, సంయుక్త కార్యదర్శి శోభన్ నాయక్ అభినందించారు.

# వెట్టి చాకిరి, బానిసత్వ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

❍ కార్మికుల హక్కుల పరిరక్షణకు చట్టాలపై అవగాహన అవసరం

❍ కార్మికుల శ్రమకు గౌరవం, తగిన ప్రతిఫలం అందేలా చూడాలి

❍ వెట్టి చాకిరి బాధితుల గుర్తింపు, పునరావాసానికి ప్రాధాన్యం

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23( జనంసాక్షి): సమాజంలో కొనసాగుతున్న వెట్టి చాకిరి, బానిసత్వం వంటి అమానవీయ దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారి శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించేలా చూడాలని అన్నారు .వెట్టి చాకిరి నిర్మూలనపై కార్మిక శాఖ రూపొందించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం అసంఘటిత రంగ కార్మికులకు వెట్టి చాకిరి నిర్మూలన, కార్మిక హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ .. వెట్టి చాకిరి అనేది మానవ హక్కులకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే అమానవీయ విధానమని అన్నారు. ఎవరినైనా బలవంతంగా పనులు చేయించడం, శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లించకుండా పనిచేయించుకోవడం, కార్మికుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారి శ్రమను దోపిడీ చేయడం వంటి చర్యలను అరికట్టాలని సూచించారు. ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు ఉందని, వారి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు .

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా ధనం' రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమం ద్వారా వెట్టి చాకిరి నిర్మూలన, బాధితుల గుర్తింపు, వారికి పునరావాసం కల్పించడం, కార్మికుల హక్కులపై అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయడం ద్వారా వెట్టి చాకిరి నిర్మూలనకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నట్లు వివరించారు.

వెట్టి చాకిరికి గురవుతున్న కార్మికులను గుర్తించడం, వారికి చట్టపరమైన రక్షణ కల్పించడం, బాధితులకు పునరావాసం అందించడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన అంశాలని తెలిపారు . కార్మికులు తమ హక్కులు, వాటి పరిరక్షణకు అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా బలవంతంగా పనులు చేయిస్తున్నా, వెట్టి చాకిరికి గురిచేస్తున్నా, శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.వెట్టి చాకిరికి సంబంధించిన ఫిర్యాదులు, సహాయం కోసం 080-69434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించి సమాచారం పొందవచ్చని తెలిపారు. కార్మికులు, బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా చట్టపరమైన సహాయం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు.ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర పని ప్రదేశాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రచార రథం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, కార్మికులకు చట్టపరంగా కల్పించిన హక్కులు, రక్షణ చర్యలు, ఫిర్యాదు చేసే విధానాలపై అవగాహన కల్పించనున్నారు.కార్మికుల శ్రమకు గౌరవం లభించేలా, వారు చేసిన పనికి తగిన ప్రతిఫలం అందేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వెట్టి చాకిరి, బానిసత్వం వంటి దురాచారాల నిర్మూలనకు ప్రభుత్వ శాఖలు, యజమానులు, కార్మికులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్యామల ప్రమోద్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కె. శ్రీరామ్, సహాయ కార్మిక అధికారులు బి. నాగరాజు, పి.వి.కె. శాస్త్రి, ఎ. యేసుపాదం, చి. రజిత, , ఏహెచ్‌టీయ బృందం, ఏబీడీ ఎన్‌జీఓ ప్రతినిధులు, ఐజేఎం ప్రచార సాధకులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## కార్మికుల సమస్యల పరిష్కారానికి మహా ధర్నాను జయప్రదం చేయాలి

**సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్‌బాబు పిలుపు**

భద్రాచలం అక్టోబర్ 23 (జనంసాక్షి) సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ధర్నాకు కార్మికులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ భద్రాచలం పట్టణ కన్వీనర్ బండారు శరత్‌బాబు పిలుపునిచ్చారు. భద్రాచలంలోని స్థానిక చంద్రరావు భవనంలో శుక్రవారం సీఐటీయూ జిల్లా నాయకుడు కొలగాని రమేష్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో శరత్‌బాబు మాట్లాడారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వం నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను సవరించాలని, వేతన సవరణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. స్కీం వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దేశవ్యాప్తంగా వేలాది కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద రెండు రోజులపాటు మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25న సంఘటిత రంగ కార్మికులు, 26న అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ హక్కుల సాధన కోసం జరిగే పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు వ్యతిరేకంటి నాగరాజు, అప్పారి రాము, వెంకటలక్ష్మి, పారెల్లి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పల్లెర్లలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం

## నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన



**ఆత్మకూర్ (ఎం) అక్టోబర్ (23) జనంసాక్షి**
వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుతూ, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం పల్లెర్ల గ్రామ పంచాయతీలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ భూముల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని, పశువుల ఎరువు, కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువుల ద్వారా నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను అనుసరించడం, పంట అవశేషాలను కాల్చకుండా సమర్థంగా వినియోగించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. భూగర్భజలాల లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నేల కోతను నివారిస్తూ పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, ఏఈ మెహర్ సాయి, వెటర్నరీ డాక్టర్ గిరి, ఏపీవో రమేష్, హెచ్ఈవో శ్రీనివాసులు, పల్లెర్ల సర్పంచ్ తండ మంజుల, లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, రాఘవాపురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్, పంచాయతీ కార్యదర్శులు బాలరాజు, వి. శ్రీనివాస్, శ్రీనివాస్ చారి పాల్గొన్నారు. రైతులు నర్సింహా గౌడ్, సుదర్శన్, రామలక్ష్మయ్య, యాదిరెడ్డి, మల్లేష్, మచ్చగిరి, వెంకటేష్ తదితరులు హాజరయ్యారు.



## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

### హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవరావు

**హాలియా, జనంసాక్షి అక్టోబర్ 23:**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హాలియా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. రాఘవరావు గారు విద్యార్థులతో ముఖాముఖిగా సంభాషించి, పోలీస్ శాఖ విధులు, పోలీస్ స్టేషన్ పనితీరు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గురించి వివరించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను గౌరవపూర్వకంగా స్మరిస్తూ, ప్రజల భద్రత కోసం పోలీసులు అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీ రాఘవరావు గారు మాట్లాడుతూ, విద్యార్థులు చట్టాలను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాలియా ఎస్ఐ శ్రీ సాయి ప్రశాంత్ గారు పాల్గొని, విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, చట్టాల ప్రాముఖ్యత, ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర గురించి వివరణ ఇచ్చారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, పోలీసులతో తమ సందేహాలను స్పష్టం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన, పోలీసులపై నమ్మకం పెంపొందించడం.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం ఎప్పుడో

### రైతులకు సరైన సమాచారం లేక మిల్లర్లకు అమ్ముకుంటున్నారు

### 16కేంద్రాలలో ధాన్యం రాశులు మద్దతు ధర కోసం ఎదురుచూపులు





**కనగల్లు అక్టోబర్ 23 (జనంసాక్షి)**
ఖరీఫ్ సీజన్ కోతలు మొదలై 20 రోజులు కావస్తున్న ప్రభుత్వం ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి అధికారులు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం లేకపోవడంతో కోత కోసిన ధాన్యాన్ని మిల్లర్లకు అమ్ముకోవడం జరుగుతుంది. కేంద్రాలలో ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పలు పోసి ఉంచడం కేంద్రాలు తెరవకపోవడంతో అకాలవర్షాలు వస్తే ధాన్యం తడిసి మొలకెత్తి, రంగు మారితే ఇంత నష్టపోవలసిన పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటాలుకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే మిల్లర్లకు టాక్టర్ మీద 30 కేజీల తూకం తరుగు తగ్గించి 2200కే క్వింటాల్ చొప్పున అమ్ముకుంటున్నారని దీంతో ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర తో పోలిస్తే 2 89 రూపాయలు నష్టం జరుగుతుంది. ప్రతి ఏటా ఈ సమయానికే సహకార సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో 15 నుంచి 20 కేంద్రాలు ప్రారంభమయ్యేవని కానీ ఈ సంవత్సరం ప్రభుత్వ నుంచి అనుమతులు రాక, గన్ని బ్యాగులు, తార్పిల్లా సరఫరా లో జాప్యం చూస్తుంటే మరో 10 నుంచి 15 రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి:రైతు సంఘం డిమాండ్**

ఎల్ నీఓ విపత్తు కారణంగా నష్టపోయిన రైతులకు మరింత నష్టం జరగకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను అందేలా అధికారులు చర్యలను వేగవంతం చేయాలని, ఆలస్యం చేసిన కొద్దీ మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వ పాలక అధికారయంత్రాంగంపై ఉందని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు

**25 ఐకెపి కేంద్రాలకు ప్రతిపాదనలను పంపించాం:ఏటీఎం దాసరి మై సే శ్వరరావు**

మండలంలో 24 దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలతో పాటు ఒకటి సన్నరకం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఏపీఎం దాసరి మై సే శ్వరరావు తెలిపారు. 24 కేంద్రాలలో 16 కేంద్రాలకు దాన్యం పోసినట్లు గుర్తించామని ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు కొనసాగిస్తామని ఏపిఎం వెల్లడించారు.

## అర్వపల్లి దేవాలయ నూతన పాలకవర్గ నియామకంలో సీనియర్లను విస్మరించడం తగదు



**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
అర్వపల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ నూతన పాలకవర్గ నియామకంలో సీనియర్ నాయకులను పక్కన పెట్టడం ఎంతమాత్రం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ పీఈటీ ఎల్లంల కొమిరెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన వారికి పదవులు కట్టబెట్టడం సరికాదన్నారు. గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేస్తున్నానని గుర్తుచేశారు. ఆలయ ధర్మకర్త పదవి కోసం తాను దరఖాస్తు చేసుకున్నప్పటికీ అవకాశం కల్పించకపోవడం తీవ్ర అన్యాయమని చెప్పారు .

### పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ

## ఓటు నమోదు చేసుకోవాలి

### ఎర్రపహాడ్ సర్పంచ్ లింగరాజు యాదవ్



**నూతనకల్ అక్టోబర్ 23 ( జనంసాక్షి)**
పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ నవంబర్ 6 వరకు ఓటరుగా నమోదు చేసుకొని నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్ రెడ్డికి పట్టబద్రులు మద్దతు తెలపాలని ఎర్రహహాడ్ సర్పంచ్ గాడుదుల లింగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యావంతుడైన రాకేష్ రెడ్డి ని గెలిపించినట్లయితే నిరుద్యోగుల పట్ల పోరాటం చేసి వారి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వాలపై పోరాడతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఇరుగు అంజయ్య నాగరాజు అనిల్ లింగన్న మోజుష్ లక్ష్మణ్ వెంకన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువ సంఘసంస్కర్త అవార్డు అందుకున్న గుర్రాల నాగరాజు

### ఏం ఎన్ ఎస్ ఫౌండర్స్ డాక్టర్ బైరి నరేష్ , గాండ్ల సుజాత టీచర్ చేతుల మీదుగా ప్రధానం




**మోటకొండూరు, అక్టోబరు 23 (జనంసాక్షి):**
సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని, హేతువాద భావాలను పెంపొందించే లక్ష్యంతో 'మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం' (ఏం ఎన్ ఎస్) ఆధ్వర్యంలో తమిళనాడులోని చెన్నై నగరంలో ఉన్న ప్రసిద్ధ 'పెరియార్ తిడల్' వేదికగా అక్టోబరు 17, 18, 19 తేదీలలో మూడు రోజుల పాటు 3వ జాతీయ మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి. ఏం ఎన్ ఎస్ వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్ మరియు జాతీయ సమన్వయకర్త గాండ్ల సుజాత నేతృత్వంలో ఈ మహాసభలు దిగ్విజయంగా ముగిశాయి. దేశవ్యాప్తంగా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, సంఘం కోసం, సమాజ హితం కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలు మరియు నాయకులను ఈ మహాసభల వేదికగా అభినందిస్తూ ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. ఈ క్రమంలోనే సమాజ మార్పు కోసం, హేతువాద భావాల ప్రచారానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి, యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఏం ఎన్ ఎస్ తెలంగాణ రాష్ట్ర యూత్ కమిటీ జాయింట్ సెక్రటరీ గుర్రాల నాగరాజు కి జాతీయ నాయకత్వం యువ సంఘసంస్కర్త' అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా గుర్రాల నాగరాజు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మూఢనమ్మకాల నిర్మూలన కోసం, శాస్త్రీయ సమాజ స్థాపన కోసం తన వంతు కృషిని మరింత ఉధృతం చేస్తానని తెలిపారు. మహాసభలు విజయ వంతంగా ముగియడంతో ప్రతినిధులంతా హేతు వాద స్ఫూర్తితో స్వస్థలాలకు పయనమయ్యారు.

# అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

## - ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విద్యాసంస్థల్లో అవగాహన కల్పించిన బీఆర్ఎస్ నేతలు..



బూర్గంపహాడ్ అక్టోబర్ 23 (జనంసాక్షి) అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత పిలుపునిచ్చారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపు మేరకు శుక్రవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ, గురుకుల కళాశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో బీఆర్ఎస్ నాయకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై వివరించారు. అర్హత కలిగిన పట్టభద్రులంతా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని, అవసరమైన పత్రాలను సమర్పించి తమ అర్హతను నిర్ధారించుకోవాలని నాయకులు సూచించారు. ఓటరు నమోదుకు సంబంధించిన విధానం, సమర్పించాల్సిన ధ్రువపత్రాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే పద్ధతిని వివరించారు. ఓటు హక్కును కోల్పోకుండా, సరైన అభ్యర్థిని ఎన్నుకునేందుకు దానిని వినియోగించుకోవడం ప్రతి పట్టభద్రుడి బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బిజ్జం వెంకట్రామిరెడ్డి, మాజీ మండల యువజన అధ్యక్షుడు గోనెల నాని, మైనార్టీ మాజీ మండల అధ్యక్షుడు సాధిక్ పాషా, చట్టు ఆంజనేయులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీలు ఇచ్చి మూడేళ్లు.. నిరుద్యోగుల ఎదురుచూపులు ఎన్నాళ్లు?

○రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి..
○రూ.4 వేల నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి..
○సామాజిక కార్యకర్త, పట్టభద్ర నిరుద్యోగి బర్ల మధు డిమాండ్..



అశ్వాపురం అక్టోబర్ 23 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాలని సామాజిక కార్యకర్త, పట్టభద్ర నిరుద్యోగి బర్ల మధు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు.

**ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి:**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చిందని బర్ల మధు గుర్తుచేశారు. ముఖ్యంగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి హామీలను అమలు చేసి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా నిరుద్యోగుల సమస్యలకు ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించలేదని విమర్శించారు. హామీల అమలుపై స్పష్టమైన ప్రకటనలు చేయడంతో పాటు, వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు.

**ఉద్యోగ నోటిఫికేషన్లకు స్పష్టమైన కాలపట్టిక ఏది?**

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరించి, శాఖల వారీగా నియామక ప్రక్రియ చేపట్టాలని బర్ల మధు కోరారు. జాబ్ క్యాలెండర్ ద్వారా నోటిఫికేషన్లు, పరీక్షలు, ఫలితాలు, నియామకాలకు నిర్దిష్ట గడువులు ప్రకటించాలని సూచించారు.కేవలం ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటనలు చేయడం కాకుండా, నిరుద్యోగులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు నియామకాలపై స్పష్టత కల్పించాలని కోరారు.

**వయోపరిమితి పెరుగుతోంది.. ఆర్థిక భారం తప్పడం లేదు:**

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటున్న యువతకు ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని బర్ల మధు ఆవేదన వ్యక్తం చేశారు. కోచింగ్ ఫీజులు, పుస్తకాలు, ప్రయాణం, వసతి ఖర్చులు పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. నియామకాల్లో జాప్యం కారణంగా అభ్యర్థుల వయస్సు పెరిగిపోతోందని, అర్హత ఉన్నప్పటికీ వయోపరిమితి కారణంగా అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్లను సకాలంలో విడుదల చేయాలని, అవసరమైన చోట నిబంధనలకు అనుగుణంగా వయోపరిమితి సడలింపును పరిశీలించాలని కోరారు.

**పట్టభద్రుల ఆకాంక్షలను విస్మరించొద్దు:**

ఉమ్మడి వరంగల్?ఖమ్మం?నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని బర్ల మధు సూచించారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు కీలకంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి ప్రభుత్వ ఏర్పాటుకు ముఖ్య భూమిక పోషించారని బర్ల మధు గుర్తు చేశారు . ఎన్నికల సమయంలో ఓట్లు కోరే రాజకీయ పార్టీలు, యువతకు ఇచ్చిన హామీల అమలుపై కూడా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.తెలంగాణలో సుమారు 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారనే అంశాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని, అధికారిక గణాంకాలతో పరిస్థితిని అంచనా వేయాలని కోరారు. ప్రతి నిరుద్యోగి వెనుక ఒక కుటుంబం ఉంటుందని, ఉద్యోగం లేకపోవడం వల్ల ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రిమండలి, కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తెలంగాణ నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని బర్ల మధు విజ్ఞప్తి చేశారు. యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీల అమలుకు చర్యలు తీసుకుని యువతలో విశ్వాసాన్ని పెంపొందించాలని కోరారు.ఉద్యోగాల భర్తీకి తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి హామీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలను ఇకనైనా ప్రధాన అంశంగా పరిగణించి పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తు ఎన్నికల్లో యువతలో ప్రభుత్వంపై అసంతృప్తి రాజకీయ ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎన్నికల హామీలను అమలు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బర్ల మధు కోరారు.

### వ్యాపారుల హక్కుల పరిరక్షణే లక్ష్యం..

# పారదర్శక పాలనకు పెద్దపీట

## - మూడేళ్ల పదవీకాలాన్ని ఎనిమిదేళ్లకు పొడిగించుకున్న పాత కమిటీపై విమర్శలు..
## - రికార్డు స్థాయిలో 1,120 మంది సభ్యుల నమోదు.. నవంబర్‌లో ఎన్నికలు..



భద్రాచలం అక్టోబర్ 23 (జనంసాక్షి) వ్యాపారుల హక్కుల పరిరక్షణ, సంస్థలో పారదర్శక పాలన, సమష్టి నాయకత్వమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తెలిపారు. గత పాలకవర్గం పనితీరు, సంస్థ నిర్వహణలో లోపాలు, సభ్యత్వ నమోదు, రాబోయే ఎన్నికలపై వారు పలు అంశాలను వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చాంబర్ ప్రస్తుత కమిటీ ప్రతినిధులు గత పాలకవర్గంపై విమర్శలు చేశారు.

**- మూడేళ్ల పదవీకాలం.. ఎనిమిదేళ్ల పాటు కొనసాగింపు.**

2016లో భద్రాద్రి చాంబర్ ఆఫ్ కామర్స్ పేరుతో ఎన్నికైన గత పాలకవర్గం నిబంధనల ప్రకారం మూడేళ్లకే పరిమితం కావాల్సి ఉండగా, ఎన్నికలు నిర్వహించకుండా 2024 వరకు సుమారు ఎనిమిదేళ్ల పాటు పదవుల్లో కొనసాగిందని ప్రతినిధులు ఆరోపించారు. సంస్థలో ప్రజాస్వామ్య పద్ధతులను పునరుద్ధరించాల్సిన అవసరం ఏర్పడటంతో 12 మంది సభ్యులతో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కమిటీ ఎనిమిది నెలల వ్యవధిలో సంస్థ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టిందని, చట్టబద్ధమైన గుర్తింపు కోసం శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ పేరుతో నూతనంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు.

**- 1,120 మంది సభ్యుల నమోదు.**

సంస్థలో ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలు నిర్వహించేందుకు ప్రత్యేక ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు చేపట్టినట్లు వెల్లడించారు. గత పాలకవర్గం ఎనిమిదేళ్లలో సుమారు 600 మందిని సభ్యులుగా చేర్చగా, తక్కువ వ్యవధిలోనే తాము 1,120 మంది వ్యాపారులను సభ్యులుగా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వ్యాపారుల నుంచి లభించిన ఆదరణ సంస్థపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. వచ్చే నవంబర్‌లో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి, వ్యాపార వర్గాలకు సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తామని ప్రకటించారు.

**- ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతకు ప్రాధాన్యం..**

గత పాలకవర్గం హయాంలో సంస్థ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన లెక్కా పత్రాలు, నిధుల వినియోగ వివరాలపై స్పష్టత లేదని కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. వ్యాపారుల నుంచి వసూలు చేసిన చందాలు, వాటి ఖర్చుల వివరాలను సభ్యులకు వెల్లడించాల్సిన బాధ్యత గత పాలకులకు లేదా అని ప్రశ్నించారు. ఇకపై సంస్థకు సంబంధించిన ప్రతి పైసాకు లెక్కలు నిర్వహిస్తామని, ఆర్థిక లావాదేవీల వివరాలను త్వరలో మీడియా ముందు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. చాంబర్ పరిధిలోని 18 అనుబంధ వ్యాపార శాఖల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని, వ్యాపారుల హక్కుల పరిరక్షణ విషయంలో రాజీపడ బోమని పేర్కొన్నారు. ఈ సమా వేశంలో శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చారుగుండ్ల దేవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చారుగుళ్ల శ్రీని వాస్, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, ఎక్స్‌అఫీషియో సభ్యుడు పరిమి సోమశేఖర్ పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

## ఓటు హక్కుపై వేటుకు నిరసనగా ప్రజాసంఘాల ప్రదర్శన



బూర్గంపహాడ్ అక్టోబర్ 23 (జనంసాక్షి) కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఓటుపై వేటుకు నిరసనగా చేపట్టిన ఆందోళనలపై నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బూర్గంపహాడ్ మండలం సారపాక సుందరయ్యనగర్‌లో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల ఓటు హక్కును తొలగించే ఆలోచనతో జ్ఞానేష్ కుమార్‌ను పావుగా ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. ఈ పరిణామాల వల్ల దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఓటు హక్కును కాపాడేందుకు ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు పాపినేని సరోజిని, కేవీపీఎస్ మండల కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకులు కనకం వెంకటేష్, బత్తుల గోపాలరావు, అప్పారావు, జాన్మియా, నిమ్మల పద్మ, బెల్లంకొండ పద్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణనను ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలి

## భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ

- ❍ జనాభా గణన ఫేజ్?ఎఎపై రెండు రోజుల సమగ్ర శిక్షణ విజయవంతం
- ❍ 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిపై అధికారులకు సమగ్ర అవగాహన



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్23 (జనం సాక్షి): జిల్లాలో జనాభా గణన ఫేజ్?ఎఎ నిర్వహణకు సంబంధించి ఈ నెల 22, 23 తేదీలలో నిర్వహించిన రెండు రోజుల సమగ్ర శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) జె. సునీత ఆధ్వర్యంలో, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అధ్యక్షతన శుక్రవారం ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, జనాభా గణన ఫేజ్?ఎఎను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. జనాభా గణనలో సేకరించే వివరాలు ఖచ్చితంగా ఉండాలని, గణన ప్రక్రియలో నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా గణన ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జనాభా గణన ఫేజ్?ఎఎలో భాగంగా జనాభా వివరాల సేకరణ విధానం, గణన ప్రక్రియలో అనుసరించాల్సిన మార్గదర్శకాలు, సెన్సెస్ శాఖ రూపొందించిన 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన పద్ధతులపై అధికారులకు సమగ్ర శిక్షణ అందించారు. ప్రశ్నావళిలోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకొని, ప్రజల నుంచి సరైన సమాచారాన్ని సేకరించడం, వివరాలను నిర్దేశిత పద్ధతిలో నమోదు చేయడం, సమాచార సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హైదరాబాద్ సెన్సెస్ శాఖ నుంచి మాస్టర్ ట్రైనర్లుగా పాల్గొన్న రవీందర్ నాయక్, శివ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జనాభా గణనలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు అనుసరించాల్సిన విధానాలు, ప్రశ్నావళి నిర్వహణ, సమాచార సేకరణలో పాటించాల్సిన ప్రమాణాలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సందేహాల నివృత్తిపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి డి. మధు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా విద్యాశాఖ అధికారి శంభుప్రసాద్ తో పాటు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), జిల్లా స్థాయి అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జనాభా గణన ఫేజ్?ఎఎను క్షేత్రస్థాయిలో సమర్థవంతం గా, పారదర్శకంగా, ఖచ్చితమైన సమాచార సేకరణతో నిర్వహించేందుకు ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో పెడకంటి లోహిత్ కృష్ణకు గాయాలు

### ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

**కల్లూరు, అక్టోబర్ 23(జనంసాక్షి)**

ఖమ్మం పట్టణంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెడకంటి లోహిత్ కృష్ణ గాయపడగా, విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు. కల్లూరు పట్టణానికి చెందిన 18వ వార్డు పుర కౌన్సిలర్, పెడకంటి రామకృష్ణ కుమారుడైన లోహిత్ కృష్ణ ఖమ్మం పట్టణంలో ద్విచక్రవాహనం పై వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఆయన కుడి కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో వెంటనే ఖమ్మంలోని ఆరోగ్య ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయన కాలుకు శస్త్రచికిత్స నిర్వహించినట్లు రామకృష్ణ తెలిపారు. లోహిత్ కృష్ణ ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వెంటనే ఆస్పత్రికి వెళ్లి పెడకంటి రామకృష్ణను కలిసి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న లోహిత్ కృష్ణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

## అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి న్యాయం చేయాలి: పద్మశాలి సంఘం డిమాండ్

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 23,( జనం సాక్షి):**
పాల్వంచలో అనంతుల లక్ష్మీనారాయణ మృతికి కారణమైన వారిపై నిష్పక్షపాత విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పద్మశాలి సంఘం డిమాండ్ చేసింది. లక్ష్మీనారాయణ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సంఘం నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకుడు గుండు రవికుమార్ మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణ మరణంపై వస్తున్న ఆరోపణల వెనుక అసలు వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సమగ్రమైన, నిష్పక్షపాత విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధ్యులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ?తీవ్ర విషాదంలో ఉన్న లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పద్మశాలి సమాజం మౌనంగా ఉండబోదని, న్యాయం సాధించే వరకు అందరం ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీ మరియు నిరసన కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్రగుంట సాంబశివరావు, గుండు రవికుమార్, ఆడపు రమాకాంత్, దోమల కిషోర్, గుగ్గిళ్ళ రామ్మూర్తి, పిండిపోలు కన్నయ్య, మణుపురి ప్రభాకర్, ఇబ్బంది ఉదయ్, బొమ్మ రామకిషోర్, మహేష్, రాపోలు రమేష్, గుండు సిద్ధార్థ, వంకా సతీష్, శివ సాంబమూర్తి, వెలదండి ఆనంద్, సామల వెంకటేశ్వర్లు, శంకర్ వెంకటేశ్వర్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.







## అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి కోటి రూపాయలు ఇవ్వాలి

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్
- కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం
- ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి
- ఇంటి స్థలాన్ని కేటాయించి ఇంటిని నిర్మించువాలి
- జిసిసి మేనేజర్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఈ కేసు పై జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకోవాలి

**కొత్తగూడెం క్రైమ్ ,అక్టోబర్ 23 (జనంసాక్షి):**
హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీ నారాయణ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్కే ఖదీర్ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మృతుడి నివాసానికి వెళ్లిన టీ డబ్ల్యూ జేఎఫ్ నాయకుల బృందం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకొని విచారణను వేగవంతం చేయాలని, అనంతుల లక్ష్మీనారాయణకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విధినిర్వహణలో ఆయనపై వేధింపులు జరిగాయా? మానసిక ఒత్తిడికి గురిచేసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతుల లక్ష్మీనారాయణ హెచ్‌పీ గ్యాస్ కంపెనీకి ఎంతో నిబద్ధతతో సేవలందించిన ఉత్తమ ఉద్యోగి అని పద్మశాలి సంఘం నాయకులు గుర్తుచేశారు. కరోనా మహమ్మారి సమయంలో, గ్యాస్ కొరత ఏర్పడిన సందర్భాల్లో, యుద్ధ పరిస్థితుల ప్రభావం ఉన్న సమయంలోనూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు కూడా అందుకున్నారని పేర్కొన్నారు. ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగి మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ యాజమాన్యం కూడా అంతర్గత విచారణను నిష్పాక్షికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, కుటుంబం లోని ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేలా ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతుల లక్ష్మీనారాయణ పై వేధింపులు జరిగినట్లు విచారణలో తేలితే, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పద్మశాలి సంఘం నాయకులు స్పష్టం చేశారు టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్ల బండి కృష్ణమూర్తి టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం కమిటీ ఉపాధ్యక్షులు దువ్వసాగర్ కోశాధికారి వెంకటేశ్వర్లు టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు పి కృష్ణారావు సీనియర్ నాయకులు సూరిబాబు , కొడాలి వెంకటేశ్వర్లు ,వేణు ,రమేష్ కుమార్, నందిపాటి రమేష్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

# ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్య పోరాటాలు కొనసాగించాలి
- వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన



**భద్రాచలం అక్టోబర్ 23 (జనంసాక్షి)**
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు వామపక్ష ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక, భద్రాచలం పట్టణ కమిటీల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో అమరవీరుల స్తూపాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఏఐకేఎస్ జిల్లా నాయకులు ఎం.బి. నర్సారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు మారెడ్డి శివాజీ, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శివ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకొని అధికారంలో కొనసాగేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పేరుతో దేశవ్యాప్తంగా ఇప్పటికే 14 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వామపక్షాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌తో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం స్వామి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి. సీతాలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు జీవనజ్యోతి, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు నకరికంటి నాగరాజు, అజయ్‌కుమార్, చంద్రలీల, వెంకటలక్ష్మి, ఐద్వా నాయకులు నాదెళ్ల లీలావతి, గౌతమి, ఉస్తేలా జ్యోతి, నాగలక్ష్మి, కనకశ్రీ, ప్రజా సంఘాల నాయకులు సాయన్న, రాఘవయ్య, రాయల రాములు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళలకు ఏఎన్ఎం శిక్షణలో ప్రవేశాలు

- అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

**భద్రాచలం అక్టోబర్ 23 (జనంసాక్షి)**



ఐటీడీఏ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల శిక్షణ పాఠశాలలో రెండేళ్ల ఏఎన్ఎం శిక్షణ కోర్సులో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**- ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తప్పనిసరి.**
దరఖాస్తు రుసుము రూ.200ను కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలని సూచించారు. దరఖాస్తుకు పదో తరగతి, ఇంటర్మీడియట్ ధ్రువపత్రాలు, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం లేదా నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన ధ్రువపత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అవివాహిత ధ్రువీకరణ పత్రం, డీడీ అసలు ప్రతితో పాటు శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల (మహిళ) శిక్షణ పాఠశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని పీఓ బి. రాహుల్ కోరారు. ప్రవేశాలకు సంబంధించిన ఇతర వివరాల కోసం 9490370905, 9963315323, 9000983664 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



## ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**పినపాక, అక్టోబర్ 23(జనం సాక్షి):**
పినపాక మండలంలోని ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## ఆరుతడి పంటలవైపే రైతులు మొగ్గుచూపాలి

**కనగల్లు, అక్టోబర్ 23 (జనంసాక్షి)**



ఎల్ నీ ఓ విపత్తు తో భూగర్భ జలాల అడుగంటి నీటి ఎద్దడి రావడం , విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటున్నందున యాసంగిలో వరి పంటలను అస్సలు వేయవద్దని ఆరుతడి పంటల వైపు ఆసక్తి చూపాలని జీ ఎడవెల్లి క్లస్టర్ ఏ ఈ ఓ విజయలక్ష్మి రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా పోనుగోడు గ్రామపంచాయతీలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏ ఈ ఓ విజయలక్ష్మిమాట్లాడుతూ వేరుశెనగ, పెసర, మినుములు, మొక్కజొన్న, సజ్జలు జొన్నలు, మినుములు , చిరు ధాన్యములాంటి ఆరుతడి పంటలను వేయాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులకరం అండాలు వెంకటేశం, ఉప సర్పంచ్ మార్గం సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మెరుగు శివయ్య, వార్డు సభ్యులు లక్ష్మయ్య, పిచ్చయ్య, రైతులు కట్టవుశయ్య, పాశం లింగయ్య సోము రాములు, దొంతరబోయిన శివకుమార్, మెరుగు అచ్చాలు, చాడ పెద్దలు, వెంకటయ్య, మన్యం లింగయ్య, మల్లయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తీరుపై ఆదివాసి సంఘాల ఆగ్రహం

### హైకోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారు : నాయకులు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 23, (జనంసాక్షి):**
పాల్వంచ మండలం రెవెన్యూ పరిధిలోని తమ భూమి విషయంలో హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ, అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న కొత్తగూడెం-పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివాసి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మున్సిపల్ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల్వంచ మండలం రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్ 444/1/31 పరిధిలోని 3 ఎకరాల భూమి నాటి నుంచి నేటి వరకు రెవెన్యూ రికార్డులు, ధరణి, భూభారతి ప్రకారం ఎర్రబోయిన ముత్తయ్య (కుమారుడు వెంకయ్య) పేరున ఉంది. 2009 సెప్టెంబర్ 9న పంచనామా నిర్వహించి హద్దులు గుర్తించి ఎర్రబోయిన వెంకటేశ్వర్లుకు దీన్ని స్వాధీనం పరచారూ అని అన్నారు.అయితే, కొంతమంది మున్సిపల్ అధికారుల అండదండలతో ఆ భూమిలో 'కేసీఆర్ నగర్' పేరిట అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించగా.. దీనిపై హైకోర్టులో డబ్ల్యూపీఎంపీ నెం. 33019 ఆఫ్ 2010 కింద స్టేటస్కో (యథాతథ స్థితి) ఉత్తర్వులు తెచ్చినట్లు వారు తెలిపారు. గతంలో ఇక్కడ కేసీఆర్ నగరానికి ఎలాంటి పర్మిషన్లు ఇవ్వలేదని మున్సిపల్ అధికారులే సమాచార హక్కు చట్టం కింద లిఖితపూర్వకంగా తెలపడం గమనార్హం.ప్రస్తుతం ఉన్న కార్పొరేషన్ కమిషనర్ గత 30 సంవత్సరాలుగా పట్టాదారుగా ఉన్న ఎర్రబోయిన ముత్తయ్య భూమిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని నాయకులు ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ, తప్పుడు నివేదికలతో భూ పట్టాదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతో టౌన్ ప్లానింగ్ అధికారి, మిషన్ భగీరథ డిఈ తదితరులతో కుమ్మక్కై ఆదివాసి భూపట్టదారులను వేధింపులకు గురిచేస్తున్న ఈ కమిషనర్‌కు 2019 మున్సిపాలిటీ చట్టంపై అవగాహన లేదని, ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ పట్టా భూమిలో ఎలాంటి అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చినా అది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని, సంబంధిత కమిషనర్‌పై న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్షణమే కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేషన్‌లో ఆదివాసీలను, నిరుపేదలను ఇలాగే ఇబ్బంది పెడితే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో పొలిటికల్ జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ, జీఎస్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అరేం ప్రశాంత్, జిల్లా నాయకులు ఈసం ఉదయ్, పట్టాదారు వారసుడు, కమిషనర్ బాధితులు ఎర్రబోయిన మోహన్ కృష్ణ, వాసం రాముల, ఎర్రబోయిన లక్ష్మి, ఎర్రబోయిన సుభద్ర, శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి మాజీ ఎంపిటిసి ఆర్థిక సాయం

**రామన్నపేట, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన చేగూరి శివమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ, మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి శివమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. మానవత దృక్పథంతో అంత్యక్రియల నిమిత్తం 5,000 రూపాయలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బలుగూరి మధు
- వరంగల్ క్రాస్ రోడ్డు చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం

**ఖమ్మం రూరల్,అక్టోబర్ 23(జనంసాక్షి):** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు చౌరస్తాలో సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘం,కేవీపీఎస్ వంటి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బలుగూరి మధు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శి నంద్ర ప్రసాద్, సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల కమిషన్ చర్యల వల్ల బీజేపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై స్వతంత్ర విచారణ జరిపించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని, ఓటర్ల తొలగింపులకు స్పష్టమైన కారణాలు వెల్లడించాలని కోరారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, పారదర్శకతపై తలెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను సమీక్షించాలని, ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను పరిరక్షించేందుకు ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాలపై వచ్చిన ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఊరడి సుదర్శన్ రెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, ప్రజా నాట్యమండలి పాలేరు డివిజన్ కార్యదర్శి నందిగామ కృష్ణ, రైతు సంఘం ఏదులాపురం మున్సిపాలిటీ కార్యదర్శి తోట పెద్ద వెంకటరెడ్డి, అధ్యక్షులు ధనియాకుల రామన్న, కేవిపిఎస్ మండల కార్యదర్శి పగిడిపల్లి వెంకట్రావు, ప్రజానాట్యమండలి ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఏపూరి లింగయ్య, ఏదులాపురం మండల కార్యదర్శి శానం వీరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు మునిగంటి యాదగిరి, కొట్టే రామయ్య, తదితరులు పాల్గొన్నారు.




# వ్యవసాయ సేవలకు గుర్తింపు..

## గాదె నర్సిరెడ్డికి ఆదర్శ రైతు అవార్డు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్న మొరంపల్లి బంజర రైతు



**బూర్గంపహాడ్ అక్టోబర్ 23 (జనంసాక్షి)** వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన గాదె నర్సిరెడ్డికి ఆదర్శ రైతు అవార్డు లభించింది. భద్రాద్రి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆయన వ్యవసాయ రంగానికి అందించిన సేవలను గుర్తించి, 2025 కిసాన్ దివస్ సందర్భంగా ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో నర్సిరెడ్డి అవార్డును అందుకున్నారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషికి లభించిన ఈ గుర్తింపు స్థానికంగా ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన రైతుకు ఈ గౌరవం దక్కడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నర్సిరెడ్డికి లభించిన పురస్కారం గ్రామంతో పాటు మండలానికి కూడా గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు.

# పేదరికాన్ని అధిగమించి పీజీ మెడికల్‌లో రాణించిన డాక్టర్ రూత్ జాన్ పాల్



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 22 (జనంసాక్షి)** నగరంలోని రమణగుట్ట మురికివాడకు చెందిన కొయ్యల రూత్ జాన్ పాల్ పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆమె ఎన్నో కష్టనష్టాలు , అవమానాలను ఎదుర్కొంటూ చదువే లక్ష్యంగా ముందుకు సాగారు. తల్లి దండ్రుల దగ్గర ఉంటూ హైస్కూల్ , ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అనంతరం వైద్య విద్యపై ఉన్న ఆసక్తితో ఖమ్మంకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ కేవీ కృష్ణారావు తదితరుల సహకారంతో హైదరాబాద్‌లో ఎంసెట్ కోచింగ్ తీసుకున్నారు. అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేసి , హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి లో ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ విభాగంలో పీజీ వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి తన ప్రతిభను చాటుకున్నారు. పేదరికం తన లక్ష్యానికి అడ్డుకాదని నిరూపించిన డాక్టర్ రూత్ జాన్ పాల్‌ను పలువురు అభినందించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు , నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచి సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామీజీ



**భద్రాచలం అక్టోబర్ 23 (జనంసాక్షి)** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామీజీ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం వైదిక సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జీయర్ స్వామీజీకి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం జీయర్ స్వామీజీ వైదిక బృందంతో కలిసి రామాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించిన ఆయన ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మరోవైపు భద్రాద్రి రామాలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ

# వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణం

మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సంప్రదాయబద్ధంగా పుణ్యాహవాచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలను నిర్వహించి, అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. భక్తిశ్రద్ధలతో జరిగిన కల్యాణ వేడుకలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఏఈవో శ్రావణ్‌కుమార్, వైదిక, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

# బూర్గంపహాడ్‌లో వృద్ధురాలు

## కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం పోలీసుల ప్రయత్నం

**బూర్గంపహాడ్ అక్టోబర్ 23 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర పరిసరాల్లో సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు కనిపించడంతో ఆమె కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వృద్ధురాలు తన పేరు రాపిల్లి దాస్ కమలమ్మ అని, తన ఊరు బెల్లంపల్లి అని చెబుతున్నప్పటికీ పూర్తి వివరాలు వెల్లడించలేక పోతున్నారు. స్థానికులు సమాచారం అందించడంతో ఎస్ఐ మేడా ప్రసాద్ అక్కడికి చేరుకుని వృద్ధురాలిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఆమెకు సంబంధించిన వివరాలు తెలిసినవారు 8712682055, 8712682056 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్ఐ మేడా ప్రసాద్ కోరారు.

# మాజీ కార్పొరేటర్ అక్రమ బిల్డింగ్‌ను వెంటనే కూల్చండి

## సిపిఎమ్ పార్టీ డిమాండ్:కమిషనర్ కు వినతిపత్రం

**ఖమ్మం, (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలోని వైరా రోడ్ బాబురావు పెట్రోల్ బంక్ వెనుక భాగంలో అధికార పార్టీ మాజీ కార్పొరేటర్ నిర్మించిన అక్రమ బిల్డింగ్ ను వెంటనే కూల్చాలి అని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఎమ్ పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ మాట్లాడుతూ గత కొంత కాలంగా మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల అక్రమ బిల్డింగ్ లు కట్టారు అని ఎక్కడా కూడా కార్పొరేషన్ నిబంధనలను పాటించకుండా బహుళ అంతస్తుల నిర్మించారు అని ఆరోపించారు. తాజాగా వైరా రోడ్ బాబురావు పెట్రోల్ వెనుక భాగంలో ఆరు అంతస్థుల తో భారీ అక్రమ బిల్డింగ్ నిర్మించారు అని ఆరోపించారు. ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా ఇష్టారాజ్యంగా బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేశారు అని ఆరోపించారు. కనీసం భవిష్యత్తులో ఏదైనా ఫైర్ జరిగి ప్రజల ప్రాణాలకు హాని జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారు అని ప్రశ్నించారు. ఈ అక్రమ బిల్డింగ్ పై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చాయి అని, అధికారులు మాత్రం నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు అని ఆరోపించారు . కమిషనర్ వెంటనే స్పందించి తగు విచారణ జరిపించి అక్రమ బిల్డింగ్ ను కూల్చాలని డిమాండ్ చేశారు. లేని యెడల పార్టీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ బద్రం, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో ఖమ్మం విద్యార్థిని మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 23 (జనంసాక్షి)** అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్నత చదువుల కోసం వెళ్లిన ఖమ్మం కార్పొరేషన్ వాస్తవ్యులు నల్లమల ఆనంద్ కుమార్తె అక్షిత గుండెపోటుతో మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన అక్షిత అకాల మరణం బాధాకరమని పేర్కొన్నారు. అక్షిత మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అక్షిత ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# నేడు తాళ్లపెంట రైతు వేదికలో రీ సర్వే గ్రామసభ

## తాసిల్దార్ వీరభద్ర నాయక్



**పెనుబల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి):** పెనుబల్లి మండలం తాళ్లపెంట గ్రామపంచాయతీ రైతు వేదిక లో శనివారం ఉదయం 10 గంటలకు తాళ్లపెంట రెవిన్యూ గ్రామం లో జరిగే రీసర్వే పై అవగాహన గ్రామసభ నిర్వహిం చబడు తుందని పెనుబల్లి తాసిల్దార్ వీరభద్ర నాయక్ తెలియజేశారు. ఈ గ్రామ సభకు గ్రామస్తులు అందరూ తప్పక హాజరు కాగలరని తాసిల్దార్ కోరారు.

# పదోన్నతి లో జరిగిన తప్పులను సరిదిద్ది, న్యాయం చేయాలి

## రిటైర్ ర్యాంక్ ప్రమోటివ్ ఎస్ఐల డిమాండ్

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 23 (జనంసాక్షి)**

గతంలో వరంగల్ డిఐజి కార్యాలయం వేదికగా పదోన్నతి ల అంశంలో జరిగిన తప్పులను సరిదిద్ది, తమకు న్యాయం చేయాలని రిటైర్ ర్యాంక్ ప్రమోటివ్ ఎస్సై లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డైరెక్ట్ రిక్రూట్ అయిన ఎస్ఐలకు 70%, సర్వీసు ఆధారంగా ర్యాంక్ ప్రమోటివ్ ఎస్ఐలకు 30 శాతం పదోన్నతు లకు అవకాశం కల్పించాల్సి ఉండగా తమ విషయంలో అలాంటి అవకాశాన్ని కల్పించకుండా వరంగల్ డీఐజీ కార్యాలయం వేదికగా కొన్ని తప్పులు జరిగాయని తెలిపారు. ఇటీవల ఈ కార్యాలయంలో కొందరు అధికారులను సస్పెండ్ చేయడం తాము చేస్తున్న వాదన లో గల తీవ్రతను అర్థం చేసుకొని సత్వరం న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంలో డి ఐజీ, ఐ జీ లతోపాటు ప్రిన్సపల్ సెక్రెటరీ కు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు. అదే విధంగా సుప్రీంకోర్టులో సైతం రిట్ పిటిషన్ వేశామని పేర్కొన్నారు. ఈ తప్పుల వల్ల తాము నష్టపోగా తమ తర్వాత వచ్చిన డైరెక్ట్ రిక్రూట్మెంట్ ఎస్సైలు పదోన్నతుల విషయంలో లబ్ధి చెందారని వివరించారు. ఇది 1991వ బ్యాచ్ లోనే కేవలం 6 నెలల తేడా, ర్యాంక్ ప్రమోటివ్, డైరెక్ట్ రిక్రూట్మెంట్ ఎస్సై ల విషయం ఇది అని వెల్లడించారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్ అయిన ఎస్ఐలతో పాటు ఏఆర్ నుండి సివిల్స్ లో బదిలీ చేసిన ఎస్ఐల పదోన్నతి వేగంగా జరిగిందని చెప్పారు. పోలీస్ మాన్యువల్ 73 ( 6 ), ( బి ) లో ఐదు సంవత్సరాలకు ర్యాంక్ ప్రమోటివ్ ఎస్ఐలకు సీఐగా పదోన్నతి ఇవ్వాలి డైరెక్ట్ రిక్రూట్మెంట్ ఎస్సైలకు ఆరు సంవత్సరాల అనంతరం సీఐ గా పదోన్నతి కల్పించాలి. అంటూ రాష్ట్ర హైకోర్టు ఆనాటి ఏపీపిఎమ్ ఈ విషయమై విచారణ జరిపించి సీనియార్టీ లిస్టును ప్రకటించాలని కోరిన విషయాన్ని చెప్పారు. వరంగల్ డిఐజి కార్యాలయం నుండి 1992లో పంపించాల్సిన కాగితాలను 1996లో పంపించడం వల్ల ఈ విధమైన అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో ర్యాంకర్ ఎస్ఐలుగా ప్రమోషన్ పొందటానికి 33% కోటా ప్రకారం ప్రతి సంవత్సరం జూన్, జూలైలో డి ఐ జి స్థాయిలో పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. కాగా ఈ పరీక్షలు19 83లో ఒకసారి, 1990 మరో సారి మాత్రమే నిర్వహించారు. ఇదిలా ఉండగా మాకు 8/12/1991 నుండి ప్రొహిబిషన్ పీరియడ్ పెట్టి, 7/12/1992 కు ప్రొహిబిషన్ పిరియడ్ ను డిక్లేర్ చేయాల్సి ఉండగా డీఐ జీ వరంగల్ ( ఇ 1/413/92- 96 ) ఫిబ్రవరి 2 వ తేదీన మా ప్రొహిబిషన్



పీరియడ్ ను డీమిడ్ టూ బీ డిక్లేర్ అని 84 మందికి 6 సంవత్సరాల తర్వాత ప్రొహిబిష న్ పీరియడ్ డిక్లేట్ చేశారు . ఎ పీ పీ యం ఆర్డర్ నెంబర్ 73/6/బి ప్రకారం ర్యాంక్ ఎస్సైలకు ఐదు సంవత్సరాల కాలం పూర్తయిన తదుపరి ఇన్స్పెక్టర్ ప్రమోషన్ కు అర్హులు. కానీ, ఏపీ పిఎం ఆర్డర్ కూడా అమలు చేయలేదు. ఈ విధంగా తమకు పదోన్నతులు ముందుగా కల్పించకుండా 1991, 1992, 1995 బ్యాచులకు ఇన్స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు. ఇది అన్యాయం అని వాపోయారు . అలాగే ఏ ఆర్, ఏ పీ ఎస్ పీ శాఖ నుండి సివిల్ ఎస్ ఐ లు గా కన్వర్ట్ చేయుటకు, వారి దగ్గర నుంచి మొదట ఉన్న తమ శాఖ సర్వీస్ కోల్పోతామని, సివిల్ ఎస్ ఐ గా రిపోర్ట్ చేసిన నాటినుండి సర్వీస్ తీసుకుంటామని వారు లిఖిత పూర్వకం గా అధికారులకు రాసి, ఇచ్చారు. .అయినప్పటి కీ వారి సర్వీస్ ను వారి సొంత శాఖల నుండి రిక్రూట్ అయిన దగ్గర లెక్క గట్టి, మాకంటే ముందుగా పదోన్నతులు కల్పించారు. ఆర్టికల్ 220 ప్రకారం సమన్యాయం జరగ లేదని అన్నారు . 1992 లో డైరెక్ట్ రిక్రూట్ అయిన బ్యాచ్ కు సంబంధించి అప్పా కు కొంత మందికి ట్రైనింగ్ పంపించారు. మరి కొంతమందికి 11 నెలల అనంతరం శిక్షణకు పంపించారు. ఈ 11 నెలల కాలంలో యూనిఫాం లేకుండా, జీతం లేకుండా 1992 బ్యాచ్ గానే గుర్తించారు, సర్వీస్ ని లెక్కించారు.ఇది ఎలా సమన్యాయం అవుతుందని ప్రశ్నించారు. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం ఏపీఎస్పీ, ఏఆర్ నుండి సివిల్ లోకి ఎస్సైలు గా వచ్చిన వారి మొదటి నుండి వారి సర్వీసులు లెక్కిస్తున్నట్లు 2023లో (జీవో ఎమ్మెస్ నెంబర్ 13 5 1 - తేదీ 10- 7-23 ) జీవో ను కూడా విడుదల చేశారు అని తెలిపారు. అధికారులు చాలా ఇన్స్పెక్టర్ పోస్టులు మిస్ కాబడ్డాయని గుర్తించి, స్పెషల్ చీఫ్ సే క్రటరీ సీవీ ఆనంద్ ( ఐపీఎస్ ) కు విన్నవించగా ఆయన చొరవ తీసుకుని... వరంగల్ రేంజి లో 22 పోస్టులు , తెలంగాణ వ్యాప్తంగా 12 2 పోస్టులను గుర్తించారు. అయినప్పటికీ వరంగల్ డి ఐ జి కార్యాలయ సిబ్బంది 1991 ర్యాంక్ ఎస్సై ల బ్యాచ్ ను గుర్తించలేదన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను అనుసరించి మెరిట్ - సీనియారిటీ జాబితాను ఆంధ్ర డీజీపీ మొత్తం ఏడు జోన్ల కు సంబంధించి, తయారు చేశారని ఇది జీవో ఎంఎస్ నెంబర్ 153 ( తేదీ 5 / 10/2018 ) ద్వారా విడుదల చేశారని తెలిపారు. ఇందులో వరంగల్ రేంజ్ 1 అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మరో జడ్జిమెంట్ ( రిట్ పిటిషన్

1 - 4379/2013 ) ప్రకారం ఉత్తర్ ప్రదేశ్ లో సుమారు 93 మంది ర్యాంక్ ప్రమోటివ్ ఎస్ఐలకు నోషన్ సీనియార్టీ, ఇంక్రిమెంట్లు ఇచ్చారని వివరించారు. ఇదే ప్రాతిపదికపై తమకు కూడా న్యాయం, సమన్యాయం కల్పించాలని కోరారు. ఇదే అంశంపై జీవో నెంబర్ 154 ( తేదీ 5 - 10 - 2018 ) ను, ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతి జీవోను రద్దు చేసిందని తెలిపారు. కాగా దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డివిజన్ బెంచు కు అప్పిలుకు వెళ్లిందని చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర డి ఐ జి, ప్రిన్సిపల్ సెక్రటరీ లకు కూడా వినతి పత్రాలు సమర్పించామని చెప్పారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని రిటైర్ ర్యాంక్ ప్రమోటివ్ ఎస్సైలు జే నరసింహారెడ్డి , ఎండి జమీల్ పాషా , ఈ కృష్ణమూర్తి, ఎస్ కే జానీ మియా , బి బాబురావు , ఎండి యూసుఫ్ , ఎండి హకీమ్ లు ఈ విలేకరుల సమావేశంలో పాల్గొని, విజ్ఞప్తి చేశారు.



## ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

**కల్లూరు అక్టోబర్ 23(జనంసాక్షి)**

ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గుర్రం సాయి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. 31 అక్టోబర్ 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదు కోసం ఫారం-18 సమర్పించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తీసుకురావలసిన పత్రాలు: డిగ్రీ మెమో (డిగ్రీ ఉత్తీర్ణత ధ్రువపత్రం). ఆధార్ కార్డు. పాస్‌పోర్ట్ సైజు ఫోటో,మొబైల్ నంబర్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 06 నవంబర్ 2026. కావున, అర్హులైన పట్టభద్రులు అవసరమైన పత్రాలతో కల్లూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని సంప్రదించి, గడువులోగా ఫారం-18 సమర్పించి తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## ఎం ఎల్ సి ఓట్ల నమోదు ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

**పెనుబల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి)**



కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ శుక్రవారం పెనుబల్లి మండలం లంకపల్లి, వి.ఎం. బంజర గ్రామాల్లో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. లంకపల్లి, వి.ఎం. బంజర గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఫారం?18 ప్రత్యేక నమోదు శిబిరాన్ని, బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ లు) చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని కల్లూరు సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కోసం చేపడుతున్న చర్యలను, అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారి నుంచి ఫారం?18 దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును సమీక్షించారు. అర్హత కలిగిన పట్టభద్రులందరికీ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులకు సూచించారు.

## పోలియో రహిత సమాజమే మన లక్ష్యం

### జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 23 (జనంసాక్షి)**



ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ పోలియో వ్యాధి నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలని, పోలియోవైరస్ వలన వ్యాపిస్తుందని, పోలియో ఒక ప్రమాదకరమైన వ్యాధి అని ఇది ముఖ్యంగా కలుషితమైన ఆహారము మరియు నీరు, పోలియో సోకిన వ్యక్తి మలము ద్వారా ఈ వైరస్ బయటకు వస్తుందని,చేతులు సరిగా కడుక్కోకపోవడం వల్ల లేదా పారిశుద్ధ్య లోపాలు ఉన్నప్పుడు ఈ వైరస్ ఆహారము,తాగునీటి ద్వారా ఇతరుల శరీరంలోకి నోటి ద్వారా ప్రవేశిస్తుందని ఇది ప్రధానంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలను ప్రభావితం చేసి, శాశ్వత పక్షవాతానికి గురిచేస్తుందని పేర్కొనడం జరిగింది.పోలియో వ్యాధిని పూర్తిగా నివారించడానికి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు జాతీయ వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్ ప్రకారం పోలియో చుక్కలు, పోలియో టీకాలు వేయించడం అత్యంత ముఖ్యమైనదని పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని , భారతదేశంలో 2011 నుంచి ఇంతవరకు ఒక్క పోలియోకేస్ కూడా నమోదు కాలేదని అలాగే తెలంగాణ రాష్ట్రంలో 2007 సంవత్సరం తర్వాత నుంచి ఇంతవరకు ఒక కేసు పోలియో పాజిటివ్ నమోదు కాలేదని, పోలియోపై అపోహలను నమ్మకుండా ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలనితెలియపరిచారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత అవగాహన
- ఖమ్మం 8వ డివిజన్‌లో ముమ్మరంగా నమోదు ప్రక్రియ
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనలతో కార్యక్రమం: భూక్యా అశోక్

**ఖమ్మం , (జనంసాక్షి) :**

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ గారి ఆదేశాలు, సూచనల మేరకు స్థానిక నాయకుడు భూక్యా అశోక్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో శుక్రవారం విస్తృత అవగాహన, నమోదు ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా అశోక్ మాట్లాడుతూ.. 8వ డివిజన్ పరిధిలోని గోపాలపురం, ఎల్.బి. నగర్, వైఎస్సార్ నగర్, బాలపేట ప్రాంతాలకు చెందిన పాత ఓటరు జాబితాలోని 432 మంది ఓటర్లను స్వయంగా ఫోన్ ద్వారా సంప్రదించినట్లు తెలిపారు. ఓటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారా లేదా అని ఆరా తీసి, ఇప్పటికే నమోదు చేసుకున్న వారి వివరాలు సేకరించామన్నారు. నమోదు చేసుకోని వారి వద్ద నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా అర్హులైన కొత్త ఓటర్లను గుర్తించి దరఖాస్తులు చేయిస్తున్నామని, ఫోన్ కాల్స్‌కు స్పందించని వారి వివరాలను సైతం ప్రత్యేకంగా సేకరిస్తున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదు గడువు నవంబర్ 6వ తేదీతో ముగియనుందని, అప్పటి వరకు ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన యువకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సబ్‌స్టేషన్‌లో ప్రభుత్వ సొత్తు విక్రయం అటెండర్ కాదు

- ఆరోపణలు ఎదుర్కొంటున్నది అధికారే! స్పందించిన ఉన్నతాధికారులు..
- మెడికల్ లీవ్‌లో ఉన్న వ్యక్తికి మెమో జారీ!
- సమాధానం రాగానే తదుపరి కఠిన చర్యలు ఉంటాయన్న ఏఈ శ్రవణ్
- రూ. 5,000 ఆన్‌లైన్ అడ్వాన్స్ ఆధారాలు బయటపడ్డా కాలయాపనపై ఆగ్రహం
- అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని కాపాడే యత్నమా- మండిపడుతున్న స్థానికులు

**మాడుగులపల్లి అక్టోబర్ 23 (జనంసాక్షి):** మాడుగులపల్లి మండల కేంద్రంలోని 132/33 కేవీ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో ప్రభుత్వ సొత్తును అక్రమంగా విక్రయించిన వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి సబ్‌స్టేషన్ లో పనిచేసే అటెండర్ ఈ అక్రమానికి పాల్పడ్డాడని భావించినప్పటికీ, అసలు ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్నది ఆ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక అధికారేనని తేలింది ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ప్రస్తుతం వైద్య సెలవు (మెడికల్ లీవ్)లో ఉన్న సదరు అధికారి, సబ్‌స్టేషన్ ఆవరణలోని చెట్ల కట్టెలను ఒక ప్రైవేటు వ్యక్తికి రూ. 5,000 ఆన్‌లైన్ (ఫోన్ పే) ద్వారా అడ్వాన్స్ తీసుకొని విక్రయించిన ఆధారాలు బయటపడ్డాయి. పక్కా ఆధారాలతో సహా వార్తలు వెలువడి రోజులు గడుస్తున్నా, తక్షణ చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న అసలు కథ ఏమిటనేది ఇప్పుడు మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.




**వివరణ కోరుతూ మెమో ఇచ్చాం : ఏఈ శ్రవణ్**

ఈ వ్యవహారంలో జరుగుతున్న విచారణ ,చర్యలపై ఏఈ (సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్) శ్రవణ్‌ను వివరణ కోసం ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన పలు అంశాలను వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెడికల్ లీవ్‌లో ఉంటూ కట్టెలు అమ్ముకున్న సదరు సంబంధిత అధికారికి వివరణ (ఎక్స్‌ప్లనేషన్) ఇవ్వాలని కోరుతూ మెమో అందజేసినట్లు తెలిపారు. సదరు అధికారి నుంచి వివరణ రాగానే ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల మేరకు తదుపరి శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు (నెక్స్ట్‌యాక్షన్) తీసుకుంటామని ఏఈ స్పష్టం చేశారు

**కప్పిపుచ్చే యత్నమేనా?**

అయితే, అక్రమాలకు పాల్పడిన ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ తక్షణమే సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకోకుండా మెమోల పేరుతో కాలయాపన చేయడం వెనుక సదరు అధికారిని కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రభుత్వ సొత్తును అక్రమంగా విక్రయించిన అధికారిపై ఎలాంటి పక్షపాతం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



## పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జటావత్ లాలునాయక్

**తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 23 (జనంసాక్షి):** పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తిరుమలగిరి సాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ లాలునాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఆయన సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జటావత్ లాలునాయక్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అర్హత కలిగిన పట్టభద్రులను గుర్తించి, వారి ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలని సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన దరఖాస్తు ఫారాలను అర్హులైన వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆంగోతు శ్రీను నాయక్, దస్రు నాయక్, సక్క, జంగాల రవీందర్, బిచ్చాలు, , శ్రవణ్ కుమార్ రెడ్డి, బుగ్గల్ రెడ్డి, అనుముల అంజి, పాండు, కోడుమూరు నారాయణరెడ్డి ,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతల కారణంగా ఎండిపోతున్న వరి పంటలు

### బియర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి):** రాష్ట్రంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరుకాలం కష్టపడి వేసిన పంటలు సమయానికి కరెంటు లేక ఎండిపోతున్న వరి పోలాలు ఉన్న కొన్ని గంటలైనా లోఓల్టేజ్ సమస్య కారణంగా మోటార్లు కాలిపోవడం పక్కనే కృష్ణమ్మ పరవళ్లు ప్రవహిస్తున్నా రైతులకు కనీసం సాగు నీరు లేక బోర్ల కింద ఉన్న పంటలు ఎండి పోవడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఎండి పోయిన వరి పంటను చూసిన కేతావత్ బీల్యా నాయక్ ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 24గంటల విద్యుత్ అందించి రైతుల పక్షాన పెద్దన్న పాత్ర పోషించిన కేసిఆర్ పాలనను గుర్తు చేశారు. రైతులను అన్ని విధాలా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. సమాజానికి అన్నం పెట్టే అన్నదాత సంతోషంగా వుంటేనే రాష్ట్రం అయిన దేశం అయినా సుభిక్షంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో నిర్లక్ష్య పాలకుల కారణంగా నిత్యవసర ధరలు మండుతున్నాయని పరిపాలన పూర్తిగా స్తంభించిపోతుందని రైతులు ప్రజలు ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం వెంటనే రైతులకు అన్యాయం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# మంచినీటిని వృధా చేయవద్దు

### హాలియా మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి

**హాలియా, జనంసాక్షి అక్టోబర్ 23:**



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పౌరుడు నీటి వినియోగంలో అపురూప జాగ్రత్తలు వహించాలని హాలియా పురపాలక సంఘం ప్రజలకు సూచించింది. తాజా తెలంగాణ భూగర్భ జల శాఖ నివేదికల ప్రకారం భూగర్భ జలాలు 8 నుండి 11 మీటర్ల లోతుకు తగ్గినట్లు తెలిపింది.హాలియా మున్సిపల్ పట్టణంలోని కొన్ని గృహాల్లో గేట్ వాల్వ్ లేదా నీటి సరఫరాను ఆన్?ఆఫ్ చేసే వ్యవస్థ లేకపోవడంతో త్రాగునీరు వృథాగా మురుగు కాలువల్లోకి ప్రవహిస్తోందని పురపాలక సంఘం తెలిపింది. దీనిని నియంత్రించేందుకు ప్రతి నల్లా (ట్యాప్) కనెక్షన్‌కు గేట్ వాల్వ్ / ఆన్?ఆఫ్ వ్యవస్థను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరింది.గేట్ వాల్వ్ / ఆన్–ఆఫ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోని నల్లా కనెక్షన్లకు నిబంధనల ప్రకారం రూ. 5,000 జరిమానా విధించనున్నట్లు పురపాలక సంఘం హెచ్చరించింది. గృహాల్లో నీటి లీకేజీలను వెంటనే అరికట్టి, ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరింది.అనవసర నీటి వృథాను తగ్గించి, నీటి పొదుపులో అందరూ భాగస్వాములు కావాలని పురపాలక సంఘం పిలుపునిచ్చింది. "నీటిని పొదుపు చేయండి – భవిష్యత్తు తరాలకు నీటిని అందించండి" అని అందించిన ప్రకటనలో పేర్కొన్నారు.

## గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఎన్నిక

### - అధ్యక్షుడిగా రాసమల్ల రామమూర్తి -ప్రధాన కార్యదర్శిగా కొప్పు రామకృష్ణ

**సంస్థాన్ నారాయణపురం. అక్టోబర్ 23. (జనం సాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ కమిటీల అధ్యక్షుడిగా రాసమల్ల రామమూర్తి, ఉపాధ్యక్షుడిగా రాసమల్ల కృష్ణ,ప్రధాన కార్యదర్శి గా కొప్పు రామకృష్ణ,కోశాధికారిగా గంగనబోయిన గోపాల్ కార్యవర్గ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ కోసం అన్ని విధాలుగా మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. మాకు సహకరించిన మా గంగపుత్ర సంఘం నాయకులు కుల బంధువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఎలినినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

### మూడు గ్రామాల్లో గ్రామసభలు



**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి అక్టోబర్ (23)** ఎలినినో ప్రభావం వల్ల భవిష్యత్తులో తలెత్తే సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలను అధిగమించడంతో పాటు, గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆత్మకూర్ మండలంలోని లింగరాజుపల్లి, పల్లెర్ల, రాఘవాపురం గ్రామాల్లో శుక్రవారం రోజున గ్రామసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో నీటి వనరుల సంరక్షణ, నీటి కొరత నివారణ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం, భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం వంటి అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎలినినో ప్రభావంతో ఎదురయ్యే అవకాశం ఉన్న సమస్యలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కార చర్యలు చేపట్టాలని గ్రామసభల్లో చర్చించారు. నీటి వనరుల పరిరక్షణలో గ్రామస్తులు భాగస్వాములు కావాలని, ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ గ్రామసభల్లో మండల ఎంపీడీఓ రాములు నాయక్, ఎంపీవో శ్యామ్ కుమార్, ఏఈ మెహర్ సాయి, ఏపీఓ రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎర్ర సోమిరెడ్డి, యతీశ్వర్ గౌడ్ తండ మంజుల వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రూ. 5 కోట్లతో దేవాలయ అభివృద్ధికి ప్రణాళికలు: ఎమ్మెల్యే



**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 23 (జనంసాక్షి):** అర్వపల్లిలోని ప్రసిద్ధ శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 5 కోట్లతో ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక దేవాలయ భూమిలో పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా సీఎంను కలవనున్నట్లు తెలిపారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు.

## శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములు



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి):** మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన గురుస్వామి యాకరి యాదగిరి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. యాకరి యాదగిరి గత 22 సంవత్సరాలుగా అయ్యప్ప మాల ధరిస్తుండగా, గత నాలుగు సంవత్సరాలుగా శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్నారు. పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాకరి రేణుక నర్సింగరావు, గురుస్వాములు యాకరి శివ, బొచ్చు స్వామి, యాకరి మణి, బొచ్చు భాను, కామాటి భాను, బైరవ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థినికి అండగా నిలిచిన గోలి ప్రణీత పింగల్ రెడ్డి దంపతులు

### 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేత



**బీబీనగర్ (జనంసాక్షి):** నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకును సాధించినప్పటికీ ఉన్నత చదువులను చదివేందుకు పేదరికం అడ్డు రావడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ విద్యార్థినికి అండగా నిలిచారు బీబీనగర్ మండల మాజీ ఎంపీపీ, జడ్పిటిసి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోలి ప్రణీత పింగల్ రెడ్డి దంపతులు.బీబీనగర్ మండలం, జైనపల్లి గ్రామానికి చెందిన, సోము జంగయ్య – మాధవిల కుమార్తె, సోము నిఖిత, బీబీనగర్ మండల కేంద్రం లోని సాయి సంతోషి హై స్కూలు లో 10 వ తరగతి వరకు చదివి, 10 వ ఫలితాలలో 10 జిపిఏ తో ఉత్తమ ప్రతిబ కనపరిచి, ఇంటర్మీడియేట్ చిన్మయి కాలేజీలో 989/1000 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాదించి, నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు తో పటాన్ చెరువు లోని మహేశ్వర మెడికల్ కాలేజి లో ఎంబీబీఎస్ సాదించించింది, కానీ నిరుపేద కుటుంబానికి చెందిన సోము నికిత, కాలేజీ ఫీజు కట్టే పరిస్థితులలో లేక, డాక్టరు చదువుకు దూరం అయ్యి స్థితిలో ఉన్న విషయం సాయి సంతోషి హై స్కూలు కరెస్పాండంట్ ఈసారపు అచ్చయ్య గౌడ్ చొరవ తీసుకొని , కాంగ్రేస్ పార్టి రాష్ట్ర నాయకులు బీబీనగర్ మండలం మాజి ఎంపిపి ఉ జడ్పీటిసీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి దంపతులకు దృష్టికి తీసుకు రాగా, స్పందించిన గోలి దంపతులు శుక్రవారం విద్యార్థినికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయన్ని అందించారు.. ఈ సందర్బంగా గోలి దంపతులు మాట్లాడుతూ విద్యలో ప్రతిభగల విద్యార్థులు పేదరికం కారణంగా విద్యకు దూరం కావద్దని పేద విద్యార్థుల భవిష్యత్తుకు , సహయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజి కోఅప్షన్ సభ్యులు ఎండీ.అక్బర్, పింగల్ అన్న సేవాదల్ అద్యక్షులు ఎండీ.మోయిన్, ఎలుగుల నరేందర్, కాసుల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం పై రైతులకు అవగాహన

**రామన్నపేట, అక్టోబర్ 23 (జనంసాక్షి):** రామన్నపేట మండలం సిరిపురం, వెల్లంకి, సర్నేనిగూడెం గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో యాసంగి (రబీ) సీజన్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి కె. రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఆరుతడి పంటలు, నీటి పొదుపు, వి బి జి రామ్ జి, జలసిరి పనులు, ఇంకుడు గుంతలు, ఫారం పాండ్ పనులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆవుల రాములు, తహసీల్దార్ లాల్ బహదూర్, ఏ ఈ లు ఆశిష్ రాఘవ, సందీప్,, ఎంపీవో రఫీ, సర్పంచ్ లు అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి, ఇడెం రాధా శ్రీనివాస్, గంగాదేవి స్వామి, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.




## జాజిరెడ్డిగూడెం శాఖ గ్రంథాలయం చైర్మన్‌గా వేణుగోపాల్

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** జాజిరెడ్డిగూడెం శాఖ గ్రంథాలయం చైర్మన్‌గా అర్వపల్లికి చెందిన బైరబోయిన వేణుగోపాల్ ముదిరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం అర్వపల్లిలో ఎమ్మెల్యే మందుల సామేలు ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ?ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి వేల్పుల రమేష్, సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సాయిని మనోహర్, మేడి సంపత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దేవాలయ నూతన పాలకవర్గ నియామకంలో సీనియర్లను విస్మరించడం తగదు

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నూతన పాలకవర్గ నియామకంలో సీనియర్ నాయకులను పక్కన పెట్టడం ఎంతమాత్రం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ పీఈటీ ఎల్లంల కొమిరెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన వారికి పదవులు కట్టబెట్టడం సరికాదన్నారు. గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేస్తున్నానని గుర్తుచేశారు. ఆలయ ధర్మకర్త పదవి కోసం తాను దరఖాస్తు చేసుకున్నప్పటికీ అవకాశం కల్పించకపోవడం తీవ్ర అన్యాయమని చెప్పారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### మండల కమిటీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్!



**తుంగతుర్తి అక్టోబర్ 23 (జనంసాక్షి)** త్వరలో జరగనున్న ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని తుంగతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మ కమిటీ చైర్మన్ పానుగంటి నరసింహారెడ్డి హాజరై మాట్లాడుతూ... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి ఎన్ ఎస్ యు ఐ, యువజన కాంగ్రెస్ నాయకుల భాగస్వామ్యం తో ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గ్రామం లోని అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుడిలా పనిచేస్తూ పట్టభద్రులను చైతన్యపరచాలని అన్నారు. ఓటరు నమోదు ప్రాధాన్యతను వారికి వివరించి, అర్హులైన వారు ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతూ, ఎన్నికల నాటికి పటిష్టమైన కార్యాచరణతో పనిచేయాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో నేతలు సూచించారు. ఈ సమావేశంలో తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,గ్రంథాలయ చైర్మన్ గంగరాజు, జిల్లా కార్యదర్శి మారగాని వెంకటయ్య, పోలేపాక రామచంద్రు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు పొన్నాల సృజన్ కుమార్, నల్లు రామచంద్రారెడ్డి, దాసరి శ్రీను, తప్పట్ల శంకర్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షు బికోజి, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పాల్వాయిలో 'ఖేత్ బచావో' సదస్సు

### నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలు సాగు చేయాలి

**గుర్రంపోడు, అక్టోబర్ 23, (జనంసాక్షి)** రైతులు నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) సరిత సూచించారు. 'ఖేత్ బచావో' అభియాన్‌లో భాగంగా శుక్రవారం పాల్వాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగుకు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు.మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) మాధవరెడ్డి మాట్లాడుతూ.. రైతులు నేల పరీక్షల ఆధారంగానే సమతుల్య ఎరువులను వినియోగించాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ భూసారాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) భగీరథ మాట్లాడుతూ.. పంట కోత తర్వాత మిగిలిన అవశేషాలను తగలబెట్టకుండా నేలలోనే కలిపి దున్నాలని, వర్షపు నీటిని సంరక్షిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ ప్రసాద్, గ్రామ ప్రజాప్రతినిధులు మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.





## మోటకొండూరు మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

**మోటకొండూరు, అక్టోబరు 23(జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నల్గొండ?ఖమ్మం?వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని గెలిపించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేయాలని, పట్టభద్రులను కలిసి అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాస్కరుణి రఘునాథరాజు, డాక్టర్ కంకాల ఎలేందర్, ఆలేరు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, మోటకొండూర్ గ్రామశాఖ అధ్యక్షులు బుగ్గ కోంరయ్య, వివిధ గ్రామాల సర్పంచ్ లు, గ్రామశాఖ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్



**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 23 (జనంసాక్షి):** పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా తిరుమలగిరి సాగర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్సై కే వీరశేఖర్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు ఏ విధంగా సహాయం అందిస్తారు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. అలాగే పోలీసులు విధుల నిర్వహణలో వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వివిధ పరికరాల వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించి, పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, కస్తూర్బా పాఠశాల సిబ్బంది, గ్రేట్ వే స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చౌటుప్పల్ లో రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**చౌటుప్పల్, అక్టోబర్ 23 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చౌటుప్పల్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ హాజరై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఫిషింగ్, ఆన్ లైన్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, లోన్ యాప్ మోసాలు, గుర్తింపు మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. తెలియని నంబర్ల నుండి ఫోన్లు, వీడియో కాల్స్, ఆన్ లైన్ లింకులు వచ్చినప్పుడు వాటిని ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేయాలని, లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు ఉదాహరణలతో నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భీమిడి మోహన్ రెడ్డి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు బాతరాజు ఆగయ్య, కోశాధికారి బడుగు శ్రీరాములు, నారగోని కృష్ణయ్య గౌడ్, బిక్కు నాయక్, చొల్లేటి రాజయ్య, సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి గోశిక లక్ష్మయ్య, బొల్లారం లక్ష్మీనారాయణ, బొమ్మిడి సత్తిరెడ్డి, సిలివేరు కృష్ణ, కోణం వినోద, గోశిక మురళి తదితరులు,ప్రాంత సీనియర్ సిటిజన్స్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన డిఎస్పి ప్రసన్న కుమార్

**నూతనకల్ అక్టోబర్ 23( జనంసాక్షి)** వార్షిక తనిఖీలలో భాగంగా నూతనకల్ పోలీస్ స్టేషన్ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసిన సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్. తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను మరియు వివిధ రికార్డులను పరిశీలించి పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని మరియు పెండింగ్ కేసులు లేకుండా చూసుకోవాలని కేసులని సత్వరమే పరిష్కరించాలని సామాన్యులకు న్యాయం కలిగేలా అందేలా చూడాలని సిబ్బందికి సూచించాసారు. ఈ కార్యక్రమం నందు తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉపేందర్ రావు, నూతనకల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆత్మకూర్ (ఎం)జనంసాక్షి అక్టోబర్ (23)** మండల కేంద్రంలోని సిద్దేశ్వర జిన్నింగ్ మిల్లులో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పిస్తూ, దళారుల చేతిలో మోసపోకుండా కాపాడేందుకు ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా 2026–27 పత్తి సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల వివరాలను వెల్ల డించారు. అనంతరం నిబంధనలను వివరిస్తూ.. పత్తిలో తేమ శాతం 8 నుండి 12 శాతం వరకు ఉంటే నిబంధనల ప్రకారం ధర తగ్గిస్తారని, 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తిని, నాణ్యత లేని, రంగు మారి న లేదా వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని స్పష్టం చేశారు. మైక్రోనేర్ పరిధి కంటే ఎక్కువ లేదా తక్కువ ఉంటే ప్రతి 0.2 విలువకు రూ. 25 చొప్పున తగ్గిస్తారని తెలిపారు. రైతులు తమ పత్తిని లూజ్ (విడి) రూపంలో మాత్రమే తీసుకురావాలని, సంబంధిత ఏపీఎంసీ పరిధిలో ఆన్‌లైన్ ఆధార్ ప్రమాణీకరణ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న రైతుల వద్ద నుంచే కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. చెల్లింపులన్నీ నేరుగా 'ఏపీపీఎస్/పీఎఫ్‌ఎంఎస్' ద్వారా ఆధార్‌కు లింక్ అయిన బ్యాంక్ ఖాతాల్లోకే జమ అవుతాయని, రైతు లందరూ తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవా లని సూచించారు. సహాయం కోసం సీసీఐ మహబూబ్‌నగర్ శాఖ ఆఫీస్ నంబరు 08542-222210, వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబరు 89789 78517 ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, సిద్దేశ్వర జిన్నింగ్ మిల్లు యాజమాన్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్-విజయవాడ ఆరు లైన్ల రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఉప్పు కృష్ణ

- నత్తనడకన సాగుతున్న ఆరు లైన్ల రోడ్డు పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, సమన్వయం లేని అధికారులు
- నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ - స్పష్టంగా పర్యవేక్షణ లోపం
- ప్రతినిత్యం ప్రమాదాలు, ట్రాఫిక్ కష్టాలు - సెలవు రోజుల్లో మరింత తీవ్రం



**చౌటుప్పల్,అక్టోబర్ 23 (జనంసాక్షి)** హైదరాబాద్ నుండి విజయవాడ వరకు జరుగుతున్న ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉప్పు కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పనులు ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. సదరు కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడంతో డ్రైనేజీ మీద వేసిన బిళ్ళలు అక్కడక్కడ కుంగి పోయాయన్నారు. హయత్ నగర్ నుండి చౌటుప్పల్ టోల్ గేట్ వరకు ప్రతిరోజూ విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని, సెలవు రోజుల్లో గంటల తరబడి చౌటుప్పల్ లోనే నిలబడాల్సి వస్తోందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా, ట్రాఫిక్ కు పరిష్కారం చెప్పకుండా అడ్డదిడ్డంగా అస్తవ్యస్తంగా రోడ్డు వేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చౌటుప్పల్ పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎటు నుంచి రావాలి, ఎటు పోవాలి, ఎక్కడ రోడ్డు బంద్ చేస్తారో తెలియక తికమక పడుతున్నారన్నారు. ఆర్ అండ్ బీ అధికారులకు, కాంట్రాక్టర్ కు, ట్రాఫిక్ పోలీసులకు సమన్వయం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అంబులెన్సులు కూడా గంటల తరబడి ట్రాఫిక్ లో చిక్కుకుంటు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేసారి అన్ని చోట్ల పనులు కాకుండా ఒక ఫ్లైఓవర్ పూర్తయిన తర్వాత మరొకటి చేపట్టాలని, చౌటుప్పల్ పట్టణ బయటి నుండి ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. బస్ స్టాండ్, వలిగొండ రోడ్డు, ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర ప్రమాదకరంగా మారిన రోడ్లను వెంటనే బాగుచేయాలని, శ్రీని ఫార్మా నుండి తంగడపల్లి వరకు అస్తవ్యస్తంగా ఉన్న సర్వీస్ రోడ్డును మరమ్మతు చేసి అందుబాటులోకి తేవాలని, రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు టోల్ గేట్ ను ఫ్రీ చేయాలని, రాంగ్ రూట్ ఆంక్షలు ఎత్తివేసి చలాన్లు వేయకుండా ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

## అర్వపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్‌గా బీరవోలు విక్రం రెడ్డి ప్రమాణ స్వీకారం



**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 23 (జనంసాక్షి)** అర్వపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ నూతన పాలకవర్గ చైర్మన్‌గా బీరవోలు విక్రం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ సమక్షంలో ఎండోమెంట్ డివిజన్ అధికారి సుమతి నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గా బీరవోలు విక్రమ్ రెడ్డి పాలకమండలి సభ్యులు గా నర్సింగ లావణ్య, జాల జ్యోతి, ఆంగోత్ నెహ్రూ నాయక్, సూరారపు సైదులు, గుడిపల్లి మధుసూదన్ రెడ్డి లకు ప్రమాణం స్వీకారం అనంతరం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్వపల్లి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సామేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. భక్తుల కోరిక మేరకు దేవాలయం వద్ద కోనేరు, కళావేదిక, భక్తుల బస కోసం సత్రాలు నిర్మించేందుకు దేవాదాయ శాఖ దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. ?ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు వెల్పుల రమేష్, ఇందుర్తి వెంకట్ రెడ్డి, వ్యవసాయ శాఖ చైర్మన్ సురేందర్ రెడ్డి, అర్వపల్లి సర్పంచ్ చిలంచర్ల విద్యాసాగర్ , వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.